









ష్కరణలకు, విలాసవంత మైన ఉత్పత్తుల తయారీకి పేరు గాంచిన ఇటలీలో అడుగుపెట్టాలనుకున్నాడు. తన ప్రతిభకు తగ్గ అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఫ్యాషన్ క్యాపిటల్‌గా పేరున్న మిలాన్‌లోని 'ఇస్టిట్యూటో మరంగోని' ఇచ్చే స్కాలర్‌షిప్‌కి ఎంపికయ్యాడు. ఈ ఉపకారవేతనం అందుకున్న తొలి ఐరోపా యేతర విద్యార్థిగా చరిత్ర లిఖించాడు రాహుల్. ఏడాది తిరిగే సరికి భారత్‌లో జరిగిన లాక్మే ఫ్యాషన్ వీక్‌లో తళుక్కుమన్నాడు. భారతీయ డిజైనర్లకు జీవితకాల స్వప్నంగా ఉన్న లాక్మే ఫ్యాషన్ వీక్ వేదికపైకి ఏడాదిలోనే అడుగుపెట్టాడు. కేరళీయులు ధరించే బంగారు అంచు ధవళవర్ణ చేనేత (ముండు) వస్త్రాలతో ర్యాంప్ రేంజ్‌ను పెంచాడు. బెనారస్ పట్టును కేరళ ముండుతో మేళవించి నవీన ఆవిష్కరణకు తెరతీశాడు. ఒకవైపు కేరళ ముండు చేనేత, మరోవైపు బెనారస్ పట్టు కనిపించేలా ఈ వస్త్రశ్రేణిని రూపొందించాడు. ఇలా ఆరంభమైన అందాల ఆవిష్కరణ అద్భుతంగా సాగిపోయింది. చిన్న వయసులోనే లండన్, దుబాయ్, ఆస్ట్రేలియా, పారిస్ వేదికలుగా ఫ్యాషన్ పరేడ్ నిర్వహించి తన విలక్షణ శైలిని చాటుకున్నాడు రాహుల్. ఆన్‌లైన్‌లో డిజైనర్ దుస్తులు అద్దెకు ఇచ్చే 'రెంట్ ద రన్‌వే' భారతీయ డిజైనర్లలో ఒక్క రాహుల్ మిశ్రా కలెక్షన్స్ మాత్రమే స్వీకరిస్తుండటం విశేషం. ఫ్యాషన్ ప్రపంచంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'ఇంటర్నేషనల్ ఊల్‌మార్క్ ప్రైజ్' గెలుచుకున్నాడు. తామరపువ్వులోని అష్టభుజాలను ప్రాతిపదికగా తీసుకుని రాహుల్ రూపొందించిన 'ద లోటస్ ఎఫెక్ట్' కలెక్షన్ ఈ అంతర్జాతీయ అవార్డుకి ఎంపికైంది. ఇక కాలంతోపాటు కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తూ, అవార్డులు, రివార్డులు గెలుచుకుంటూ మిశ్రా తనదైన ముద్ర వేస్తున్నాడు. ■

















## వసంత శోభ

వేడుకల వేళ పందిళ్లకు తోరణాలు కట్టినట్టే.. దుస్తుల అంచులపై తీగలు అల్లేస్తుంటాడు రాహుల్. ఆ అల్లికలకు రంగురంగుల పూలను కూర్చి పంచె అంచుకు తన కుంచెతో వసంత శోభ కట్టబెడతాడు. ఈ ప్రకృతి శోభకు ప్రేరణ 2005లో వచ్చిన 'మడగాస్కర్' సినిమా అంటాడు రాహుల్. ఎంబ్రాయిడరీ కళకు మాత్రం ప్రఖ్యాత చిత్రకారుడు హెన్రీ రస్సే చిత్రించిన 'ద డ్రీమ్' తనకు ప్రేరణ అని చెబుతాడు. భారతీయ సంప్రదాయ చేనేత, కలంకారీ శైలిలోని ప్రయోగాలన్నీ ఒంటబట్టించుకుని వాటిని తన డిజైనింగ్‌లో కుమ్మరిస్తున్నాడు రాహుల్. కొమ్మలు, రెమ్మలు, పూలు, ప్రకృతి దృశ్యాలు ఇలా అన్నిటినీ పొందికగా పరిచేస్తాడు. దుస్తులపై పూలు పూయిస్తాడు. లెహంగాల అంచులకు విరులను వేలాడదీస్తాడు. వాటి చుట్టూ తుమ్మెదలు, సీతాకోక చిలుకల గుంపులూ పొదుగుతాడు. ఇంత సొగసుగా దుస్తులను తీర్చిదిద్దుతాడు కాబట్టే... ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు ఈ యంగ్ డిజైనర్. చిన్న వయసులోనే హాలీవుడ్, బాలీవుడ్ సినిమా స్టార్లను, స్పోర్ట్స్ స్టార్లను ఆకట్టుకున్నాడు. మొత్తంగా ఫ్యాషన్ విపణిలో నయా ట్రెండ్ సృష్టిస్తున్నాడు. పశ్చిమ సోయగాలకు తూర్పు వైభవాన్ని పరిచయం చేస్తున్నాడు.



